పంటల బీమా మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జిల్లా సమగ్రాభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు

ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను ఇచ్చినా అభివద్ధికి నోచని కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి డిమాండ్ చేశారు. శనివారం జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా నుంచి 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను ఇచ్చినా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా ఏమిటని ప్రశ్నించారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఆలూరు, ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో యువతకు ఉపాధి లేక, రైతులకు సాగునీరు లేక, విద్యార్థులకు నాణ్యతమైన విద్య అందడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి ఏటా ప్రాణాలు పోతున్నా పాలకులకు, ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పశ్చిమ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు, పాదయాత్రలు చేపట్టడంతో ప్రభుత్వంలో చలనం వచ్చిందని, పూర్తికాని అభివృద్ధి పనులపై కాలయాపన చేస్తోందని విమర్శించారు. జిల్లాలో వేదవతి, నగరడోన, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మించి హంద్రీనీవా నుంచి 106 చెరువులకు నీరు నింపాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించాలని, వైద్య, విద్యాభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 13 నుంచి సిపిఎం ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో జీపుజాతాతో ప్రజలను చైతన్య పరిచి, 26న ఆదోని నుంచి 31న కలెక్టరేట్ వరకు మహా పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, మండల నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, కృష్ణ, ఈరన్న, మైనా పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి మాట్లాడారు. సాగునీరు లేక సరైన పంటలు పండక, రైతులు, కూలీలు పొట్ట చేత పట్టుకొని వేరే ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన దారుణమైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో సాగునీరు అందించడానికి తక్షణమే ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. వేదవతి, మేళిగనూరు దగ్గర తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికోసం సిపిఎంగా ఈనెల 26 నుంచి 31 వరకు ఆదోని నుంచి కర్నూలుకు మహా పాదయాత్ర చేపడుతున్నామని తెలిపారు. చివరి రోజున వేలాది మందితో కలెక్టరేట్ దిగ్బంధనం చేపడుతున్నట్లు చెప్పారు. యువకులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు, సిపిఎం ఆదోని పట్టణ, మండల కార్యదర్శి లక్ష్మన్న, లింగన్న, ఆదోని మండల కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు తిక్కప్ప, శాఖ కార్యదర్శులు హనీఫ్ బాషా, పరమేష్, ఆదోని పట్టణ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్ రెడ్డి

రైతులకు పంటల బీమా వర్తింపు

- రైతు దినోత్సవంలో ఎంపీ సంజీవ్‌కుమార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద 2022 ఖరీఫ్ పంట నష్టపోయిన 2,42,426 రైతులకు రూ.192.52 కోట్ల బీమా పరిహారం నేరుగా ఖాతాలలోకి జమ అయిందని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు.ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలోని 2,42,426 మంది రైతులకు సంబంధించిన వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం రూ.192.51 కోట్లు మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ... నాలుగేళ్ల నుంచి రైతుల సంక్షేమం కోసం రూ.లక్ష 30 వేల కోట్ల చేశారని తెలిపారు. విద్య మీద ప్రత్యేక దృష్టి ఉంచి అందరికీ మెరుగైన విద్యను అందించేందుకు రూ.65 వేల కోట్లతోపాటు నాణ్యమైన వైద్యానికి సుమారు రూ.60 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. నష్టపోయిన రైతులకు నియోజకవర్గాల వారీగా ఆదోనికి 1770 మందికి రూ.1.52 కోట్లు, ఆలూరులో 60,740 మందికి రూ.47.19 కోట్లు, కోడుమూరులో 30,380 మందికి రూ.25.67 కోట్లు, కర్నూలులో 155 మందికి రూ.0.19 లక్షలు, మంత్రాలయంలో 34,718 మందికి రూ.14.83 కోట్లు, పాణ్యంలో 13,164 మందికి రూ.15.48 కోట్లు, పత్తికొండలో 64,840 మందికి రూ.61.27 కోట్లు, ఎమ్మిగనూరులో 36,659 మందికి రూ.26.33 కోట్లు జిల్లాలో మొత్తం 2,42,426 మంది రైతులకు రూ.192.52 కోట్ల మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే సుధాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ... రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు ఇందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ జెడి పిఎల్.వరలక్ష్మి, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, మత్స్య శాఖ అధికారి శ్యామల, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, కెవికె బనవాసి ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ, ఆత్మ డిపిడి శ్రీలత పాల్గొన్నారు.

ప్రయివేటు, కార్పొరేట్‌కు తొత్తుగా డిఇఒ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థలకు డిఇఒ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్, సాయి ఉదయ్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మాంటిస్సోరి పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నగరంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలైన మాంటిస్సోరి, నారాయణ, శ్రీచైతన్య, భాష్యం, శ్రీలక్ష్మి, సిరాక్, కేశవరెడ్డి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. రెండో శనివారం సెలవు దినం ఉన్న కర్నూలు జిల్లా డిఇఒ రంగారెడ్డి విద్యాసంస్థలకు పాఠశాలలు నడుపుకోమని చెప్పారన్నారు. సెలవు దినం పాఠశాలలు నడపకూడదని ప్రభుత్వం చెబుతున్నా నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తుగా మారిన డిఇఒ వెంకట రంగారెడ్డిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సిటీ ఉపాధ్యక్షులు నరసింహ, సహాయ కార్యదర్శిలు అబ్బు, భాస్కర్, నాయకులు తేజా, యోగి, ఏలియా పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు కోసం నిరసన

- కలెక్టరేట్ ఎదుట సిపిఎస్ ఉద్యోగుల ధర్నా
- మద్దతు తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని సిపిఎస్ ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా సిపిఎస్‌ను రద్దు చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో ఫ్యాప్టో, జాక్టో, పోర్టో ఉపాధ్యాయ సంఘాలు పాల్గొన్నాయి. యుటిఎఫ్ కర్నూలు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులు జయరాజు, సుధాకర్, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్ జిల్లా కార్యదర్శి నవీన్ పాటి బాబు, సిఐటియు ఓల్డ్ సిటీ సెక్రెటరీ విజయ్ ఎపిటిఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మరియానందం, ఇస్మాయిల్ ఎపిటిఎఫ్ 257 జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. సిపిఎస్ జిపిఎస్ రెండు విధానాలు ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టదాయకమేనన్నారు. ఈ రెండు విధానాలను వెంటనే ఉపసంహరించుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు కోసం జరిగే పోరాటానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, రమణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు రమణ, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మహాపాదయాత్రకు విస్తృత ప్రచారం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26 నుంచి 31 వరకు కర్నూలు జిల్లావ్యాప్తంగా నిర్వహించే మహాపాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు నగరంలో ఇంటింటికి తిరిగి సిపిఎం బృందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండలకేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుంచి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుంచి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్‌టైల్ పార్కులను నిర్మించాలన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతి పత్రాలు ఇస్తామన్నారు. రెండో దశలో 11, 12, 13న కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాలలో ఆరుజీపు జాతాల ద్వారా ప్రచారం చేయనున్నారు. విద్యుత్ భారాలను తగ్గించాలని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విద్యుత్ ప్రధాన కార్యాలయాల ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన నిర్వహించి ఎస్ఇలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈనెల 10, 11 తేదీల్లో కర్నూలు ధర్నా చౌక్‌లో నిరసన తెలపడానికి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు విడుదల చేసి ధర్నాకు భారీగా తరలిరావాలని ప్రచారం చేశారు. ఈనెల ఒకటి నుంచి జగనన్న సురక్ష పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమస్యలను గుర్తించడంతోపాటు కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొంటున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి కోరుతూ నంద్యాల జిల్లా గోరుమానుపల్లె గ్రామంలో అధికారులు ప్రజలనుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ప్రజల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. అధికార పార్టీ ఎమ్మెల్యే అనుమతి ఇవ్వాలని వాదించగా, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి అనుమతి ఇవ్వవద్దని వాదించారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యుడు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా టమోట ధర కిలో రూ.160కి పెరిగింది. సబ్సిడీ టమోటా కర్నూలు మార్కెట్‌లో గంట, రెండు గంటలు అమ్మి స్టాక్ అయిపోయిందని బోర్డు పెడుతున్నారు. వర్షం దోబూచులాడుతోంది. సీజన్ అయిపోతున్నా పూర్తిస్థాయిలో వర్షం కురువక పోవడంతో రైతులు ఆందోళన చెంతుతున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు నిబంధనల ప్రకారం నిర్వహించలేదని డిఇఒ కార్యాలయం ముందు ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాతపద్ధతిని అమలు చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగులు మరోసారి నిరసన తెలిపారు. కర్నూలు 165 అవతరణ దినోత్సవాన్ని తెలుగు సూరన్న తోటలో ప్రముఖ పరిశోధకులు ఆచార్య మన్సూర్ రహ్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 165 అంశాలను ఎంపిక చేసిన కవులు, రచయితలతో 165 పుస్తకాలను ముద్రించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆదీనంలో నిర్వహించేందుకు మేధావులను, ప్రజాప్రతినిధులను, విద్యా సంస్థలను భాగస్వాములను చేయాలని అనుకున్నారు.

వివరాలు తెలుసుకుంటున్న డిఇఒ వెంకట్‌రెడ్డి

పోలకల్ హైస్కూల్‌ను తనిఖీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలం పోలకల్ హైస్కూలును డిఇఒ వెంకటరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మవడి బయో మెట్రిక్‌ను, మెనూను,ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. అలాగే ఐఎఫ్ఎ టేబులెట్ బోర్డులు బోధనకు ఎంతో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. ఈ ఏడాది నుండి విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలని, ఉన్నత స్థాయిలో రాణించేలా దృష్టి సారించాలని సూచించారు.

రోడ్డుకోసం సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు నుండి చను గొండ్ల మీదుగా కోడుమూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని శనివారం చనుగొండ్ల గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో ప్రజలతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి జె. మోహన్ మాట్లాడుతూ గూడూరు చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు ఉన్న రహదారి గుంతల మయమైందని 15 సంవత్సరాల క్రితం రోడ్డు వేశారని వేసిన సంవత్సరానికి వర్షాలు కారణంగా గుంతలు ఏర్పడ్డాయన్నారు. ఈ మార్గంలో ప్రజలు పేషెంట్లు,గర్భిణీలు బాలింతలు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో చనుగొండ్ల గ్రామంలో నిండు గర్భిణీ కాన్పు కోసం హాస్పిటల్‌కు వెళ్లే లోపు మార్గం మధ్యలోనే అంబులెన్స్ లోనే ప్రసవించిందన్నారు. ఆర్‌టిసి వాళ్ళు ఈ రోడ్డు మార్గాన రెండు బస్సులు నడిపే బస్సులు నిలిపేశారన్నారు. జూన్‌లో చనగండ్లలో గడపగడప కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ దృష్టికి సిపిఎం తీసుకొని వెళ్లగా పది రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ప్రజల సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. 20 రోజులు దాటినా కూడా రోడ్డు గురించి స్పందించడం లేదన్నారు. వెంటనే స్పందించకపోతే గ్రామ ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు మాధవ కృష్ణయ్య, కోటయ్య, రామాంజనేయులు, సుధాకర్, రంగ నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు రమేష్, రంగడు ఉపేంద్ర,మహేంద్ర పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ఎస్‌బిఐ సర్కిల్‌లో వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ

జిల్లా వ్యాప్తంగా వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలోని ఎస్‌బిఐ సర్కిల్ వద్ద రూ.10 లక్షలు మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో ఏర్పాటు చేసిన వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని శనివారం కర్నూలు ఎంపి సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ సుధాకర్, వైసిపి కర్నూలు నియోజకవర్గ అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, కర్నూల్ వైసిపి ముఖ్య నాయకులు కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లతో కలిసి మీటనొక్కి ఆవిష్కరించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలలు మాల వేసి నివాళులు అర్పించారు. రూ.10లక్షల తో నిర్మించిన నూతన వాటర్ ఫౌంటైన్ ను బటన్ నొక్కి ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, నగర అధ్యక్షులు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు నగరూరు శ్రీనివాసరావు, షాషావలి ,షేక్ అహ్మద్, యూనస్, ముఖ్య నాయకులు సిహెచ్.మద్దయ్య, రైల్వే ప్రసాద్, కో ఆప్షన్ మెంబర్లు నయీమ్, నవీన్, లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో

కర్నూలు క్రైమ్ : వైసిపి జిల్లా కార్యాలయంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్, కర్నూలు నియోజకవర్గ అబ్జర్వర్ హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైసిపి నగర అధ్యక్షులు సిట్ర సత్యనారాయణమ్మ పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఘనంగా నిర్వహించారు. భారీ కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. డిప్యూటీ మేయర్ అరుణ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మద్దయ్య, బిసి రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బత్తుల లక్ష్మీకాంతయ్య పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ..

పత్తికొండ: వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని పోచమిరెడ్డి సేవాదళ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. పోచమి రెడ్డి సేవాదళ్ వ్యవస్థాపకులు మురళీధర్ రెడ్డి, వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం 35 మంది మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.

వెల్దుర్తి: డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని వెల్దుర్తి పట్టణంలో వైసిపి మండల కన్వీనర్ రవిరెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి, జడ్పిటిసి సుంకన్న, సర్పంచి ముత్యాల శైలజమ్మ, పత్తికొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆరిఫ్, వెల్దుర్తి వైసిపి పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి, ఎర్రగుడి, రాతన, పెండెకల్లు, శభాష్ పురం, జొన్నగిరి తదితర గ్రామాలుతో పాటు వివిధ గ్రామాలలోమాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తుగ్గలిలో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి నివాసం నుండి స్థానిక వైసిపి నాయకులు, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ర్యాలీగా వైఎస్ఆర్ విగ్రహం వద్దకు వెళ్లారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పులికొండ నాయక్, సహకార సంఘం అధ్యక్షురాలు విజయమ్మ, అట్లా గోపాల్ రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

డిసిసి కార్యాలయంలో ...

కర్నూల్ కలెక్టరేట్ : జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు ఇతర కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ వైఎస్ఆర్‌పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు.

బటన్‌నొక్కి వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, తదితరులు

పేద విద్యార్థులకు బుట్టా రేణుక ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బుట్టా రేణుక కార్యాలయంలో వైస్ రాజశేఖర్ రెడ్డి 74 వ జయంతి సందర్భంగా మాజీ ఎపి బుట్టా రేణుక వైస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా ప్రతిభావంతులైన విద్యార్థినిలకు చదువు కోసం ఆర్థిక సహాయం అందచేసారు. సాప్ క్యాంపు గోశాల లోని గోవుల కోసం షెడ్ నిర్మాణానికి, కర్నూలు ఫుడ్ బ్యాంకు వారు పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి వారికీ ఆర్థిక సహాయం చేసారు. ఈ కార్యక్రమంలో నక్కలమిట్ట శ్రీనివాసులు ,48వ వార్డ్ కార్పొరేటర్ మల్లికా బేగం , బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, అన్వర్ బాషా ,సమన్వయకర్తలు ఖుద్దూస్, దాదాబీ, మధు శేఖర్, వసీం, వేముల శ్యామ్, ప్రతాప్, చెన్నప్ప, అభిమానులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎంపి బుట్టారేణుక

జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వెల్దుర్తి

ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన క్రిష్ణగిరి సీనియర్ జర్నలిస్టు నాగయ్య కుటుంబసభ్యులను పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి శనివారం పరామర్శించారు. నగదు ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో, క్రిష్ణగిరి ఎంపిపి వెంకట్రామిరెడ్డి, వెల్దుర్తి వైసిపి మండల కన్వీనర్ రవి రెడ్డి పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ డాక్టర్ బి. చంద్రశేఖర్‌రెడ్డి

క్యాన్సర్ ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో నిర్మితమవుతున్న క్యాన్సర్ ఆసుపత్రి నూతన భవనాన్ని ఎపి స్టేట్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్ఐడిసి) చైర్మన్ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కర్నూలు ఎపి స్టేట్ మెడికల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ స్టేట్ క్యాన్సర్ యూనిట్ ను విజిట్ చేశారని తెలిపారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, కెఎంసిలో నూతనంగా నిర్మిస్తున్న లెక్చరర్ గ్యాలరీ సివిల్ వర్క్ మాస్టర్ ప్లాన్, బిల్డింగ్ పనుల గురించి ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లతో ఆరా తీశారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్ ఓపి , ఐపి విభాగాలను జరుగుతున్న పనులను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ యూనిట్ సివిల్ వర్క్ , బిల్డింగ్ పనుల పురో గతిని పరిశీలించి పనులను తత్వరగా పూర్తి చేయాలని ఇంజనీర్లు, కాం ట్రాక్టర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూప రింటెండెంట్ డాక్టర్ ప్రభాకర రెడ్డి, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, కెఎంసి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హరిచరణ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా కిరణ్ కుమార్, ఇంజనీర్లు ఎస్ఇ రమేష్ రెడ్డి, ఇఇ శ్రీనివాస్ రెడ్డి, డిఇ రాజ్ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు...

- చినుకు రాలదు.. రైతుల చింత తీరదు...

- విత్తన ప్రారంభంలోనే నష్టాలు చవిచూస్తున్న రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రకృతి వైపరీత్యాలు, తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు ప్రతేడాది నష్టాలకు గురవుతూనే ఉన్నారు. పాలక ప్రభుత్వాలు సైతం రైతులను ఆదుకునే పరిస్థితులు లేవు. గతేడాది మండలంలో అధిక వర్షాలు కురిశాయని పత్తి పంటకు బీమా పరిహారం ఎత్తివేశారు. వేరుశనగకు ఎకరాకు రూ.1000 చొప్పన మాత్రమే వేయడంతో రైతులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కమ్ముకున్న మబ్బులు

ఈ ఏడాది అయినా వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమయ్యారు. మేఘాలు ఊరిస్తున్నాయి. కానీ చినుకు రాలడం లేదు. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. దేవనకొండ మండలంలో అత్యధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేస్తారు. జూన్ నెల ప్రారంభంలో కురిసిన అరకొర వర్షాలకు రైతులు పత్తి సాగు చేశారు. విత్తన ప్రారంభంలోనే వర్షాలు కురవకపోవడంతో విత్తనాలు భూమిలో కుళ్లిపోవడంతో మొలకలు రాలేదు. రైతులు వేల రూపాయల్లో నష్టపోయారు. జూన్ నెల మూడో వారంలో కురిసిన ఓ మోస్తారు వర్షానికి మరోసారి పత్తి విత్తనాలు నాటారు. 20 రోజులు గడుస్తున్నప్పటికీ వర్షాలు కురవకపోవడంతో మొలకెత్తిన విత్తనం సైతం గిరకబారి ఉండడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. చినుకు కోసం రైతులు ఎదురు చూడడం తప్ప మరో ప్రత్యామ్నాయ అవకాశం ఏమీ లేకపోవడంతో రైతులకు ఈఏడాది కరువు పరిస్థితులు తప్పడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైతులకు పాలక ప్రభుత్వాలు చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేసి ఉపాధి మార్గాలు చూపించాలని పలు ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-ఆలూరు

వెనకబడిన ఆలూరు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా పోరాడాలని వక్తలు కోరారు. శనివారం వాసవీ కల్యాణ మండపంలో ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ సందర్భంగా రౌండ్‌టేబుల్ సమావేశం డివిజన్ ఇన్‌ఛార్జీ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రమైన ఆలూరు సబ్ జైలును పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా సబ్ జైలు లేకపోవడంతో నిరుపేదలైన కక్షిదారులు సుదూర ప్రాంతాలు ఆదోని, పత్తికొండ సబ్ జైలుకు వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా నాయకులు భూపేష్ మాట్లాడారు. వేదవతి ప్రాజెక్టు సాధన కోసం వామపక్షాల పోరాటం మరువలేనిదన్నారు. వేదవతి నిర్మాణంలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. 8 టిఎంసిల ప్రాజెక్టును 3 టిఎంసిలకు కుదించడం రైతులను దగా చేయడమేనని విమర్శించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆలూరు నియోజకవర్గం వెనుకబడిందని తెలిపారు. విద్యారంగం అభివృద్ధి చెందినప్పుడే ప్రజల్లో చైతన్య

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా నాయకులు భూపేష్

వస్తుందన్నారు. సిపిఎం నాయకులు షాకీర్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మద్దతు ధరతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కురవల్లి చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మారిస్తే ఆలూరు పట్టణానికి నీటి సమస్య తీరుతుందన్నారు. భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ నాయకులు జనార్దన్ మాట్లాడుతూ... ఆలూరు మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తే రైతులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. హాలహర్వి మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి మండల కన్వీనర్ అశోక్, తెలుగు యువత అధికార ప్రతినిధి సురేంద్ర, టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మనోహర్, జనసేన మండల నాయకులు ఛత్రపతి, యశోద, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు ఎల్లప్ప, యుటిఎఫ్ నాయకులు బసవరాజు, రాఘవేంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, ప్రజాశక్తి జిల్లా ఇన్‌ఛార్జీ రాజు, విలేకరులు కృష్ణ, నాగరాజు, రవి, కాశీం, మురళీ, వీరభద్రగౌడ్ పాల్గొన్నారు.

దొంగతనం జరిగిన తీరును వివరిస్తున్న బాధితుడు

ఆదోనిలో వరుస చోరీలు

- బెంబేలెత్తుతున్న సామాన్యులు

- గస్తీ పెంచాలని పోలీసులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వరుస చోరీలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. వైఎంకె స్కూల్ వద్ద ఉన్న కొత్త బ్రిడ్జి పక్కన ఆర్‌టిఒ కార్యాలయం సమీపంలోని ఐరన్ వెల్డింగ్ వర్క్ షాపులో గత రాత్రి ఇనుము షెడ్లను కట్ చేసి దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. లోపలికి దూరిన దొంగలు రెండు చేతి గ్రైండర్ మిషన్లు, బ్లేడ్లు, ఇరాన్ షీట్లు, ఐరన్ వస్తువులు దొంగలించారని బాధితులు మహబూబ్ శనివారం వాపోయారు. దీని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని తెలిపారు. అక్కడి వ్యాపారులు మాట్లాడుతూ... రాత్రి సమయాల్లో పోలీసు గస్తీ పెంచాలని కోరారు. శిరుగుప్ప టర్నింగ్ నుంచి నూతనంగా ఉన్న వైఎంకె స్కూల్ బ్రిడ్జి వరకు సుమారు ఎక్కువ శాతం ఐరన్ దుకాణాలు ఉన్నాయన్నారు. ఈ దుకాణాల్లో నిత్యం చోరీలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఉన్న దుకాణదారులంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనని చెప్పారు. పోలీసులు వెంటనే దొంగలను పట్టుకుని బాధితునికి న్యాయం చేయాలని తోటి వ్యాపారులు కోరారు.

స్థాయికి మించి విమర్శలు సరికాదు...

- టిడిపిలో తలాతోక లేని వారు మంత్రిని విమర్శిస్తే ఊరుకునేది లేదు

- వైసిపి కన్వీనర్ ఏరూరు రంగస్వామి

ప్రజాశక్తి - చిప్పగిరి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణపై టిడిపిలో తలాతోక లేనివారు విమర్శిస్తే ఊరుకునేది లేదని వైసిపి మండల కన్వీనర్ ఏరూరు రంగస్వామి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్పరి మండలంలోని సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ నౌనేపాటి చౌదరి, టిడిపి నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాలని హితవు పలికారు. జయరామ్ మంత్రి అయిన తర్వాత నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, చంద్రబాబు మాదిరిగా టిడిపి నాయకులకు కూడా మతిభ్రమించిందన్నారు. చిల్లర రాజకీయాలు చేసే మీకు మంత్రిని, నారాయణను విమర్శించే స్థాయి లేదని తెలిపారు. గతంలో కోట్ల సుజాతమ్మ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారో పేపర్లలో చూసి తెలుసుకొని అప్పుడు మాట్లాడాలన్నారు. కోట్ల సుజాతమ్మ డోన్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు హౌసింగ్ స్కీంలో అవినీతి పేపర్లు కుప్పలు, తెప్పలుగా ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాలని గుర్తు చేశారు. జయరామ్ మంత్రి అయిన తర్వాత నియోజకవర్గంలో ఒక్క ఫ్యాక్షన్ గ్రామం కూడా లేదని తెలిపారు. ఆలూరులో బట్టి భాస్కర్ అనే వ్యక్తి భట్టి సారా అమ్ముకునే వాడని, జయరామ్‌కు బంధువని ఇంతవరకు వదిలేశామని చెప్పారు. భట్టి భాస్కర్‌కు జయరామ్ ఎలాంటి వారో తెలుసని, ఎవరో మాయ మాటలు చెప్పారని, వారి మాటలు నమ్మి మంత్రిని విమర్శించడం తగదని హెచ్చరించారు. వైసిపి నాయకులు గోవిందరాజులు, బెల్డోన గోవిందు, రాజన్న, ధర్మేంద్ర, కాజీపురం రమేష్, బాలకృష్ణ, షేకన్న, పరమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రంగస్వామి

బొజ్జమ్మ కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో టిడిపి నుంచి ఇటీవల వైసిపిలో చేరిన కప్పట్రాళ్ల బొజ్జమ్మకు, ఆమె భర్త రామచంద్ర నాయుడు కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఎమ్మెల్యేను, యువ నేత వై.ప్రదీప్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆలూరు నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజల్లో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఉన్నారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బొజ్జమ్మ దంపతులు

36 గంటల ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు మండల కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కలెక్టరేట్ ఎదుట జరిగే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. శనివారం 36 గంటల ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి రాముడు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెబ్సిబా రాణి, లూసమ్మ, వరలక్ష్మి, దేవి, భీమలింగమ్మ మాట్లాడారు. అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 10, 11న కర్నూలు కలెక్టర్ ముందు జరిగే 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఉపయోగపడే పథకాలను క్రమేపి వారికి అందకుండా దూరం చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయడం లేదని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదని తెలిపారు. వీరికి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు.

నాడు- నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల్లో నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నాడు-నేడు పనులను ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భరత్ కుమార్, నాయకులు నాగరాజు, గణేష్, శశిధర్, తరుణ్, పవన్, రాజు పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో డీఎస్పీ పూజలు

ప్రజాశక్తి - నందవరం

గురజాల శ్రీరామలింగేశ్వర స్వామిని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం డీఎస్పీ దంపతులకు ఆలయ పూజారి హంపీ స్వామి స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డీఎస్పీ దంపతులను గురజాల సర్పంచి వీరస్వామి శాలువా కప్పి సన్మానించారు.

డీఎస్పీని సన్మానిస్తున్న సర్పంచి వీరస్వామి

రోడ్డును ఆక్రమించిన ఘనుడు...

- ఆక్రమణలపై చర్యలు తీసుకునే నాథుడే లేరా..?

- కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన ఓ ఘనుడు ఏకంగా రోడ్డును ఆక్రమించారు. ఆ రోడ్డు పక్కన తనకు స్థలం ఉండడంతో రోడ్డు స్థలం కూడా తమదంటూ నాపరాతి బండలు పాతారు. దీనివల్ల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ కమిషనర్ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకునే నాథుడే లేకపోవడంతో రోడ్లు కూడా ఆక్రమణకు గురైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. గీతా నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌కు ఎదురుగా సర్వే నెంబర్ 317 పైకిలో లేఅవుట్ ప్లాన్ నెంబర్ 222/78, ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం ఫైల్ నెంబర్ 15827/78/డి5లో కనబరిచిన 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును గీతా నగర్‌లో నివాసం ఉంటున్న గొల్ల ఉలి రామాంజనేయులు, బంధువులు ఆక్రమించి దౌర్జన్యంగా నాప బండలు పాతారు. ఈ రోడ్డు పక్కన ఉన్న శ్రీచైతన్య స్కూల్ స్థలం యాజమాన్యం హిరణ్మయి మాస్టర్ ప్లాన్ 40 అడుగుల రోడ్డు అభివృద్ధి కోసం సర్వే నెంబర్ 419 పైకిలో విస్తీర్ణం 175.46 (0.02 సెంట్లు) చదరపుగజాల స్థలాన్ని ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి ఇచ్చారు. ఎప్రిల్ 21, 2011న ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ వారి పేరిట ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించారు. డాక్యుమెంట్ నెంబర్ 2107/2011 ద్వారా హక్కు కల్పించారు. ఈ మాస్టర్ ప్లాన్ రోడ్డు యుటి.ఎల్లయ్య కాంప్లెక్స్ (శ్రీరామ్ ఫైనాన్స్ ఆఫీస్) నుంచి ప్రభుత్వాస్పత్రి మార్చురి వెనుక భాగంలో గల మెయిన్ రోడ్డు వరకు 40 అడుగుల వెడల్పు కలిగి ఉంది. గొల్ల ఉలి రామాంజనేయులు మాస్టర్ ప్లాన్ రోడ్డు పక్కన వారి స్థలం ఉండడంతో ఇక్కడ మాస్టర్ ప్లాన్ రోడ్డు లేదని, ఈస్థలం తమదంటూ ఆక్రమించారు. రోడ్డుకు అడ్డంగా, స్కూల్ విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బంది కలిగేలా నాపబండలు పాతారు. ఈ ఆక్రమణపై మున్సిపల్ కమిషనర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ వ్యవహారం వివాదస్పదంగా మారినా, మాస్టర్ ప్లాన్ రోడ్డుకు అడ్డంగా పాతిన బండలను తొలగించకుండా మున్సిపల్ కమిషనర్ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆక్రమణదారులకు కమిషనర్ కొమ్ము కాస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పై తెలిపిన సర్వే నెంబర్‌లో గల 40 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు రికార్డులను పరిశీలించి ఆక్రమణదారులపై, బండలను తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని రోడ్డుకు అడ్డంగా పాతిన బండలను తొలగించి, ప్రజా ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు. ఇరు వర్గాల పత్రాలను డీఎస్పీ పరిశీలించి, విచారణ చేపడుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా బండలు పాతిన ఘనుడు

ఆక్రమణదారునిపై చర్యలు తీసుకోవాలి

- ఆరవీటి సుధాకర్ శెట్టి

మున్సిపల్ అప్రూవల్ పొందిన రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం..?

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

- ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రతి సవాల్ విసిరారు. శనివారం రైతు దినోత్సవం (వైఎస్ఆర్ జయంతి) సందర్భంగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న వైఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తాను అభివృద్ధి చేయలేదని, ఈసారి జరిగే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని తిక్కారెడ్డి కోరడం సంతోషమేనని తెలిపారు. 2014-19 వరకు ఎమ్మెల్యేగా మీరేం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నీరు-చెట్టు తిక్కారెడ్డి, ఆయన సోదరుడు కమీషన్లు తిన్న విషయం తెలిసిందేనన్నారు. నాడు వైఎస్ఆర్ హయాంలో, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పులికనుమ ప్రాజెక్టు వచ్చిందని, దానిని తిక్కారెడ్డి తానే తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.70 కోట్లతో 5 లిఫ్ట్ ఇరిగేషన్లు తెచ్చామని తెలిపారు. కౌతాళం మండలం ఎరిగేర గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.50 లక్షలతో ఎస్ఎస్ ట్యాంకును నిర్మించామని, వారంలో ప్రారంభిస్తామని చెప్పారు. కేవలం కోసిగిలోనే 1250, మంత్రాలయంలో 650 ఇంటి స్థలాలు మంజూరు చేశామని తెలిపారు. రాని వారికి మళ్లీ భూమి కొనుగోలు చేసి అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో చర్చించామని తెలిపారు. త్వరలో భూమి కొనుగోలు పూర్తి అవుతుందన్నారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య మాట్లాడారు. ఇటీవల ఓ వైసిపి నాయకుడు టిడిపి తీర్థం పుచ్చుకున్నారని, త్వరలో తాను కూడా టిడిపిలో చేరుతున్నానని పుకార్లు వినిపిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ఊహాగానాలు ఎవరూ నమ్మవద్దని చెప్పారు. వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలో మండల కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్ఆర్ సర్కిల్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా వెళ్తూ సోమప్ప సర్కిల్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. **చిప్పగిరి**లో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు, వైసిపి కన్వీనర్ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచులు గోవిందరాజులు, రమాదేవి, సావిత్రి, లక్ష్మీదేవమ్మ, వైస్ ఎంపిపి పద్మావతి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం చిప్పగిరి ఆస్పత్రిలో రోగులకు, బంబం స్వామి దర్గా దగ్గర ఉన్న అనాథలకు బ్రెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. వైసిపి సీనియర్ నాయకులు ధర్మేంద్ర, రాజన్న, శ్రీధర్, షేకన్న, బెల్డోన గోవిందు, భాస్కర్, సతీష్, రమేష్, పరమేష్, నాగరాజు, గోవర్ధన, అజయ్, నారి, వెంకటేష్, తిరుమలేష్ పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. చిప్పగిరి ప్రాథమిక పాఠశాలలో నిరుపేదలకు గుండెకు సంబంధించిన ఉచిత మెడికల్ శిబిరం నిర్వహించారు. ఎంపిటిసి సుంకన్న, వైసిపి నాయకులు నాగప్ప, ఓబులేసు, మల్లికార్జున, లోకనాథ్, సేనాపతి, జిల్లా వాల్మీకి అధ్యక్షులు రామాంజనేయులు పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**లో వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎంపిపి ఈరన్న, మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు మఠం మహంతేష్ స్వామి, వైసిపి నాయకులు నాడిగేని నాగరాజు, నాడిగేని నరసింహులు, ఎస్.మాణిక్య రాజు, ఐరన్‌గల్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, జగదీష్ స్వామి, పి.నాగేష్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని వైఎస్ఆర్ విగ్రహానికి మండల నాయకులు దేశాయి ప్రహ్లాద ఆచారి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచి పాల్‌దినకర్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, మాజీ సర్పంచి అవతారం, చౌదరి బసవ, వడ్డే రామన్న, సక్కరి తిక్కయ్య, ఉమాపతి, సమ్మద్, భీమేష్, రాజా అహ్మద్, వీరేష్, బంటకుంట ఈరన్న, వార్డు మెంబర్ రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే మండలంలోని బదినేహల్ గ్రామంలో వైసిపి నాయకులు వీరభద్ర గౌడ్, ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచి ప్రసన్నకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండలంలోని కుంబాలనూర్ గ్రామంలో వైసిపి నాయకులు అనిల్ కుమార్, సూరిబాబు, వీరన్న గౌడ్, గోతులదొడ్డి హనుమేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. **నందవరం**లో సర్పంచి సావిత్రి, ఉప సర్పంచి జె.శివారెడ్డి గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ముగతి విరుపాక్షి రెడ్డి, పూలచింత సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, మీసాల సంపత్, చాంద్ తాత పాల్గొన్నారు. **ఆస్పరి**లోని జగనన్న కాలనీలో వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులు, బాలింతలు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్‌బికెలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఎం సందేశాన్ని వీక్షించి ఆర్‌బికె ఆవరణంలో మేజర్ పంచాయతీ సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, జడ్‌పిటిసి దొరబాబు, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, మండల జెసిఎస్ కన్వీనర్ బసవరాజు, సొసైటీ సిఇఒ అశోక్, ముత్తుకూరు, చిన్నహోతూరు సర్పంచులు తోయజాక్షప్ప, హరికృష్ణ, ఎంపిటిసి రాధాకృష్ణ, వైసిపి నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, రాజన్న గౌడ్, హార్టికల్చర్ అసిస్టెంట్ అనిల్ నాయుడు పాల్గొన్నారు. **ఆదోని**లోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్ మాట్లాడారు. రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.తాయన్న, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఖలందర్, మండల అధ్యక్షులు నెట్టేకల్ హనుమంతు, నాగరాజు, రాజశేఖర్, రాజు స్వామి పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్ గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర నాయకులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. సర్పంచి అరుణ్ కుమార్, మండల కన్వీనర్ మల్లికార్జున, కెడిసిసి మాజీ డైరెక్టర్ దాసరి లుమాంబ, ఎంపిటిసి నామాల శ్రీనివాసులు, వైసిపి సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, శేషాద్రి రెడ్డి, మాజీ ఎంపిటిసిలు చాప ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, పులి నరేష్ పాల్గొన్నారు.

గ్రూపు విభేదాల నడుమ వేడుకలు : దేవనకొండ గ్రామంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు వైసిపి నాయకుల గ్రూపు విభేదాల నడుమ జరిగాయి. ముందుగా కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆమె భర్త, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, ఎంపిటిసి తపాల శ్రీనివాసులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. కొంతసేపటికి జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుమాంబ, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు రాజారెడ్డి, దివాకర్ నాయుడు, ప్రేమనాథరెడ్డి, వెలమకూరు రామచంద్ర ఆధ్వర్యంలో పూలమాల వేసి కేక్ కట్ చేశారు. మండలంలో వైసిపి నాయకుల మధ్య గ్రూపు విభేదాలు స్పష్టంగా బయటపడ్డాయని పలువురు చర్చించుకుంటున్నారు.

తెర్నేకల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మంత్రాలయంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

చిప్పగిరిలో రోగులకు, అనాథలకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

చిప్పగిరిలో చిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి

ఎమ్మిగనూరులో పండు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి

కౌతాళంలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆస్పరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

కోసిగిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నందవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎక్కడ..?

- ఆత్మకూరు నుంచి ముగ్గురున్నా అభివృద్ధి శూన్యం
- కార్పొరేషన్ కార్యక్రమాలకూ హాజరు కాని వైనం..

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీ కార్యకర్తలకు పదవులు ఇచ్చేందుకు పెద్ద ఎత్తున కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటిలో డైరెక్టర్లుగా, చైర్మన్లుగా నియమించింది. ఈ నేపథ్యంలోనే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆత్మకూరు మండలం నుండి ముగ్గురికి వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా అవకాశం సాధించారు. ఇందులో షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఆత్మకూరుకి చెందిన అంజాద్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా గ్రంధివేముల పార్వతిని, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రామలక్ష్మయ్యకు పదవులు దక్కాయి. అయితే ఈ ముగ్గురు కూడా నేడు ఆత్మకూరులో కార్పొరేషన్ కార్యక్రమాలకు, పార్టీకి అందుబాటులో కూడా లేరు. ఒక్కొక్క కార్పొరేషన్ డైరెక్టర్‌కి నెలకు 13 వేల నుండి 16 వేల రూపాయల వరకు వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తుంది. షేక్ కార్పొరేషన్ ఉన్నప్పటికీ ఆ సామాజిక వర్గాల అభివృద్ధి కోసం ఎలాంటి సంక్షేమ పథకాలను ఈ ప్రాంత ప్రజలకు అమలయ్యే విధంగా ఆ డైరెక్టర్ పని చేయలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొన్నటి వరకు వైసిపి పట్టణ అధ్యక్షుడిగా ఉన్న అంజాద్‌ను పట్టణంలోని నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు అతనిని పదవి నుంచి తప్పించాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి తేవడంతో తప్పని పరిస్థితుల్లో తొలగించారు. దీంతో అంజాద్ అలీ పార్టీపై వ్యతిరేకత పెంచుకొని ఇతర పార్టీలోకి వెళ్లేందుకు తన అనుచరులతో చర్చించుకొని అవకాశం వస్తే ఏ పార్టీలోకైనా వెళ్లేందుకు సిద్ధంగా

ఉన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జి పార్వతి తన తండ్రి గ్రంధివేముల బాలన్న వైసిపి ఎస్సీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కొనసాగేవారు. కొన్ని కారణాల వల్ల స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బాలన్నను కూడా జిల్లా అధ్యక్ష పదవి నుండి తొలగించడంతో ఆయన కూడా పార్టీకి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన కర్నూల్లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె జి.పార్వతి కూడా కర్నూలుకు వెళ్లారు. ఆమె కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవేతను తీసుకోడమే తప్ప అడపా దడపా కార్పొరేషన్ ఏర్పాటు చేసే సమావేశాలకు వెళ్లడానికే పరిమితమవుతున్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన మరో కార్పొరేషన్ డైరెక్టర్ రామ లక్ష్మయ్య రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నప్పటికీ ఆయన పదవి పొందినప్పుడు నుండి ఏ రోజు ఆత్మకూరులో కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన హాజరు కావడం లేదు. ఇతను కూడా కర్నూలులో నివాసం ఉంటూ అప్పుడప్పుడు ఆత్మకూరుకి రావడం పోవడమే తప్ప పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ఆత్మకూర్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లుగా ఉమ్మడి జిల్లాలోనే పేరు ఉంది. అయితే ఈ ప్రాంతంలో క్రీడాభివృద్ధి కోసం ఆయన స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్‌లో ఏనాడూ చర్చ పెట్టి కృషి చేసిన దాఖలాలు లేవు. ఆత్మకూరు పట్టణం నుండి ముగ్గురు డైరెక్టర్లు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని పెద్ద ఎత్తున ప్రజలు చర్చించుకుంటున్నారు.

చల్లా కుటుంబంలో

మరోసారి విభేదాలు

ప్రజాశక్తి - అవుకు

దివంగత ఎమ్మెల్సీలు చల్లా రామకృష్ణారెడ్డి, చల్లా భగీరథ రెడ్డి కుటుంబంలో విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి మరణానంతరం ఆయన సతీమణి అవుకు మండల జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి పార్టీ బాధ్యతలను స్వీకరించడంతో కుటుంబంలో విభేదాలు మొదలయ్యాయి. దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి చల్లా సోదరులతో కలిసి రాజకీయాల్లోకి అరంగ్రేటం చేశారు. కుటుంబంలో ఆర్థిక లావాదేవీల కారణంగా ఎమ్మెల్సీ సతీమణి చల్లా శ్రీలక్ష్మి, చల్లా విఘ్నేశ్వర రెడ్డిల మధ్య గొడవలు ప్రారంభమై చివరకు బహిరంగంగానే రోడ్డుపై గతంలో జరిగాయి. పోలీసులు, రాజకీయ పెద్దలు సర్ది చెప్పడంతో కొంతకాలంగా ప్రశాంతత నెలకొంది. అయితే అప్పటి నుండి చల్లా శ్రీలక్ష్మి పాల్గొనే కార్యక్రమాలకు ఎవరూ వెళ్లకుండా కఠినంగా ఆంక్షలు విధిస్తున్నారని, తన దగ్గరికి రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారని శనివారం మీడియా సమావేశంలో జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి తెలిపారు. అవుకు మండల జడ్పిటిసి సభ్యురాలినైనా తనను పార్టీ కార్యక్రమాలు కూడా పాల్గొనకుండా అడ్డు తగులుతున్నారని, అధికారులను బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించారు. వైఎస్ఆర్ జయంతి వేడుకలను చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, చల్లా శ్రీలక్ష్మి అనుచరులు వేరువేరుగా జరుపుకొని మీడియా సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఒకరిపై ఒకరు నిందలు వేసుకునే క్రమంలోనే గొడవ ప్రారంభమయింది. దీంతో బనగానపల్లె సిఐ తిమ్మారెడ్డి హుటాహుటిన చల్ల పార్టీ కార్యాలయం వద్దకు చేరుకొని ఇరుగ్రూపులను

ఘర్షణ పడుతున్న ఇరు గ్రూపుల నాయకులు

మీడియాతో మాట్లాడుతున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

చెదరగొట్టారు. అనంతరం ఇరుగ్రూపుల నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు ఏదైనా జరగరానిది జరిగితే అందుకు బాధ్యులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా సూర్యప్రకాశ్ రెడ్డిలదే బాధ్యత అంటూ బహిరంగంగా జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

మహాపాదయాత్రకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 26నుంచి 31 వరకు కర్నూలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే మహాపాదయాత్ర కోసం సిపిఎం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కర్నూలు పట్టణంలో ఇంటింటికి తిరిగి సిపిఎం బృందాలు సమస్యలను సేకరిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో సమావేశాలు, సభలు నిర్వహించి మహాపాదయాత్ర ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరింది. జిల్లా కేంద్రం నుండి రాజధాని అమరావతికి రోడ్డు, రైలు మార్గాలు వేసి, కర్నూలు నుండి అమరావతికి రెగ్యులర్ రైలు నడపాలన్నారు. రైల్వే వ్యాగన్ వర్క్ షాప్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదోని, ఎమ్మిగనూరులలో టెక్స్‌టైల్ పార్కులను నిర్మించా లన్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం దశలవారి ఆందోళనలలో భాగంగా ఈనెల 10 వరకు గ్రామాల్లో, వార్డులలో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి సచివాలయాల్లో వినతి పత్రాలు ఇస్తామన్నారు. రెండో దశలో 11,12,13 తేదీల్లో కరపత్రాలు వేసి అన్ని నియోజకవర్గాలలో ఆరుజీపు జాతాల ద్వారా ప్రచారం చేయనున్నారు. విద్యుత్ భారాలను తగ్గించాలని కర్నూలు, నంద్యాల జిల్లాల్లో విద్యుత్ ప్రధాన కార్యాలయాల ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన నిర్వహించి ఎస్ఇలకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈనెల 10, 11 తేదీల్లో కర్నూలు ధర్నా చౌక్‌లో నిరసన తెలపడానికి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు విడుదల చేసి ధర్నాకు భారీగా తరలిరావాలని ప్రచారం చేశారు. ఈనెల ఒకటి నుంచి జగనన్న సురక్ష పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమస్యలను గుర్తించడంతోపాటు కుల, ఆదాయ, ఇతర సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొంటు న్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి కోరుతూ నంద్యాల జిల్లా గోరుమానుపల్లె గ్రామంలో అధికారులు ప్రజలనుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ప్రజల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. అధికార పార్టీ ఎమ్మెల్యే అనుమతి ఇవ్వాలని వాదించగా, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్‌రెడ్డి అనుమతి ఇవ్వవద్దని వాదించారు. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యుడు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా టమోట ధర కిలో రూ.160కి పెరిగింది. సబ్సిడీ టమోటా కర్నూలు మార్కెట్‌లో గంట, రెండు గంటలు అమ్మి స్టాక్ అయి పోయిందని బోర్డు పెడుతున్నారు. వర్షం దోబూచులాడుతోంది. సీజన్ అయిపోతున్నా పూర్తి స్థాయిలో వర్షం కురవక పోవడంతో రైతులు ఆందోళన చెంతుతున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు నిబంధనల ప్రకారం నిర్వహించ లేదని డిఇఒ కార్యాలయం ముందు ఉపాధ్యా యులు ఆందోళన చేశారు. సిపిఎస్ రద్దు చేసి పాతపద్దతిని అమలు చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగులు మరోసారి నిరసన తెలిపారు. కర్నూలు 165 అవతరణ దినోత్సవాన్ని తెలుగు సూరన్న తోటలో ప్రముఖ పరిశోధకులు ఆచార్య మన్సూర్ రహ్మాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 165 అంశాలను ఎంపిక చేసిన కవులు, రచయితలతో 165 పుస్తకాలను ముద్రించాలని నిర్ణయించారు. ప్రభుత్వ ఆదీనంలో నిర్వహించేందుకు మేధా వులను, ప్రజాప్రతినిధులను , విద్యా సంస్థలను భాగస్వాములను చేయాలని అనుకున్నారు.

ఉమ్మడి పౌరస్మృతి ఆమోదయోగ్యం కాదు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - నంద్యాల

పలు మతాలు, సంస్కృతి ఆచారాలతో కలిసి మెలిసి జీవిస్తున్న దేశ ప్రజలకు ఉమ్మడి పౌర స్మృతి ఆమోదయోగ్యం కాదని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం స్థానిక డబ్రాల మసీద్‌లో లౌకిక ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ముహమ్మద్ అబులైస్, జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్‌ల అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే ఈ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ఎంపీలు ఓటు వేయాలన్నారు. ఆయా పార్టీల ఎమ్మెల్యేలు సిఎం జగన్ మోహన్ రెడ్డికి, ప్రతి పక్ష నాయకులు నారా చంద్ర బాబు దృష్టికి ఈ చట్టం అమలును ప్రజలు నిరసిస్తున్నట్లు తెలపాలన్నారు. ఆయా పార్టీల ఎంపీలకు వ్యతిరేక ఓటుకు ఆదేశించాలని, ఈ చట్టం వల్ల జరిగే నష్టాలు వివరించే అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి కేంద్రం ఏకపక్షంగా అమలుకు సిద్ధమైన ఉమ్మడి పౌర స్మృతి చట్టాన్ని వ్యతిరేకించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు మస్తాన్ వలి ప్రవేశం పెట్టిన తీర్మానాలను రౌండ్ టేబుల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో ఎస్‌డిపిఐ రాష్ట్ర అధ్యక్షులు అతావుల్లా ఖాన్, టిడిపి నంద్యాల పార్లమెంటరీ కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, జమైతుల్ ఉలేమా రాష్ట్ర కన్వీనర్ మౌలానా ఖలీల్ అహ్మద్, తబ్లిక్ జమాత్ అమీర్ ముఫ్తీ మౌలానా రఫీ, కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి మస్తాన్ ఖాన్, వైసిపి కోఆప్షన్ మెంబర్ సయ్యద్ సలాముల్లా, టిడిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ మహబూబ్ వలి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, కౌన్సిలర్ యూసుఫ్, మాజీ కౌన్సిలర్ మనియార్ ఖలీల్, ఎంఎ గౌస్, పర్వేజ్, ప్రభుత్వ ఖాజీ సమ్దాని, మౌలానా అబ్దుల్లా, మౌలానా రహంతుల్లా, హాఫీజ్ ఇసాక్, హాఫీజ్ అబ్దుల్ హాది, ఆవాజ్ అధ్యక్షులు బాబుల్లా, ఆవాజ్ యూత్ సద్దాం, అక్రం, ఐయుఎంఎల్, వెల్ఫేర్ పార్టీ, అడ్వకేట్లు, ఆల్ మేవా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

కర్షకులకు అండగా వైసిపి ప్రభుత్వం

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పరిహారం జమ
- 49,637 మంది రైతులకు రూ.46.67 కోట్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కర్షకులకు అండగా వైసిపి ప్రభుత్వం నిలుస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. శనివారం రైతు దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా వరుసగా నాల్గవ ఏడాది 2022 ఖరీఫ్ పంట నష్టపోయిన రాష్ట్రంలోని 10.20 లక్షల మంది రైతులకు రూ.1,117.21 కోట్ల బీమా పరిహార మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్‌లో లైవ్ ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ అధికారి పరమేశ్వరి తదితరులు వీక్షించారు. అంతకుముందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా వరుసగా నాల్గవ ఏడాది 2022 ఖరీఫ్ పంట నష్టపోయిన 49,637 మంది రైతులకు రు.46.67 కోట్ల బీమా పరిహారం జమ చేశారని తెలిపారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5238 మంది రైతులకు 10.24 కోట్లు, బనగానపల్లిలో 1548 మంది రైతులకు రూ.3.65 కోట్లు, డోన్‌లో 21,889 మంది రైతులకు రూ.15.08 కోట్లు, నందికొట్కూర్‌లో 14479 మంది రైతులకు రూ.10.37 కోట్లు, నంద్యాలలో 1510 మంది రైతులకు రూ.1.99 కోట్లు, పాణ్యంలో 3,232 మంది రైతులకు రూ.4.28 కోట్లు, శ్రీశైలంలో 1,741 మంది రైతులకు రూ.1.04 కోట్లు మొత్తం 49,637 మంది రైతులకు రు .46.67 కోట్ల బీమా పరిహారం జమ చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులు పెట్టుబడి పెట్టేందుకు బీమా పరిహారం మొత్తం అందజేయడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం వారు రైతులకు వైఎస్సార్ బీమా పరిహారం చెక్కును అందచేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కును అందజేస్తున్న జెడ్పి చైర్మన్, ఎమ్మెల్సీ తదితరులు

మొక్కలు నాటుతున్న ఎంపిపి బాలస్వామి తదితరులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం : ఎంపిపి

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సరంక్షించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రుద్రవరం మండల ఎంపిపి ఎం.బాలస్వామి తెలిపారు. శనివారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఎపి జీవ వైవిధ్య మండలి గుంటూరు వారి ఆదేశాల మేరకు స్థానిక కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి మనుగడకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పెంచాలన్నారు. కార్యక్రమంలో వాసవి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ ఎం.శ్రీనివాసులు, కో ఆర్డినేటర్లు శంకర్, నాగయ్య, వైసిపి నాయకులు బైరి శంకర్, నరసింహులు, పెద్దన్న, వెంకట చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ పరిశీలన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టనంలోని 12వ వార్డులో జరుగుతున్న సిసి రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను ఆదేశించారు. కాలనీ వాసుల కొన్ని దశాబ్దాల కల ఎమ్మెల్యే నాని, వార్డ్ కౌన్సిలర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాయబ్ రసూల్ ప్రోద్బలంతో నేడు సాకారం అయిందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్

నీటి కలుషితంతోనే చేపలు మృతి

- ఉప సర్పంచి జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోయిలకుంట్లలో ప్రవహిస్తున్న కుందూనదిలో నీరు కలుషితం కావడంతో చేపలు చనిపోయాయని కోయిలకుంట ఉపసర్పంచి జిసిఆర్ ఎస్.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కందూ నదిలో మృతి చెందిన చేపలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలకు నీరు కలుషితం కావడంతో తాగునీరు అందించలేకపోయామన్నారు. ఈ నీటిని సంబంధిత అధికారులతో పరీక్షలు జరిపించి వారి అనుమతి మేరకు అందిస్తామన్నారు. గ్రామపంచాయతీ ద్వారా పంపిణీ చేసే నీటిని తాగవద్దని సూచించారు. ఏవైనా అనారోగ్య సమస్యలు వస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయంపై పట్టణ ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలన్నారు.

కుందూలో చేపల మృతి బాధాకరం : ప్రజా సంఘాల నాయకులు

కోయిలకుంట్ల పట్టణ శివారులోని ప్రవహిస్తున్న కుందూ నది తీరంలో చేపలు మృతి చెందడం బాధాకరమని ప్రజాసంఘాల కన్వీనర్ ఎం.సుధాకర్, బందెల ఓబులేసు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా కుందూ నది పాణ్యం నుండి కోయిలకుంట్ల మీదుగా రాజోలి వరకు ప్రవహిస్తుందన్నారు. అలాంటి జీవనదిలో ఈ రోజు వేలాది చేపలు చనిపోవడం బాధాకరమన్నారు. చేపల మృతితో తీరం వెంట వున్న వేల ఎకరాల రైతులు కూడా ఆందోళన చెందుతున్నారని అన్నారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గరకు రైతులు, మత్స్యకారులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నవీన్, అరదేశీ రఘు, మరియు రమేష్, మురళి పాల్గొన్నారు.

కుందూ నది ఒడ్డున చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న ఉపసర్పంచి జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి

దేవస్థానం రస్తా భూమికి హక్కు కల్పించాలి : సిపిఐ

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం నందిపల్లి గ్రామ సమీపంలో ఉన్న సూర్యనంది దేవస్థానానికి, గోపవరం గ్రామ పొలిమేరలో ఉన్న దేవస్థానం రస్తా భమికి సర్వ హక్కులు కల్పించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా పక్రుద్దీన్, మండల కార్యదర్శి వీరప్ప, జిల్లా సమితి సభ్యుడు సోమన్న డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ సూర్యనంది దేవస్థానంకు సంబంధించిన గోపవరం గ్రామ పొలిమేరలో ఉన్న దేవస్థాన భూమి సుమారు 9 ఎకరాల 15 సెంట్ల భూమికి నందిపల్లె గ్రామానికి చెందిన ఆవుల నాగేశ్వర్రెడ్డి నుండి సర్వే 46లో 4 సెంట్లు భూమిని రస్తాకు దేవస్థానం వారు 12 సంవత్సరాల కిందట కొన్నారని తెలిపారు. ఈ రోజు వరకు రిజిస్టర్ చేయించలేదన్నారు. వెంటనే దేవస్థానం అధికారి రస్తా భూమి హక్కును ఆవుల నాగేశ్వరరెడ్డి నుండి పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేయించాలని డిమాండ్ చేశారు.

వర్గీకరణ జరిగేవరకూ ఉద్యమం : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కడియాల జయరాముడు మాదిగ, జిల్లా కన్వీనర్ శివ నారాయణ మాదిగ తెలిపారు. శనివారం మండలంలోని కటికవానికుంట గ్రామంలో ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దండోరా జెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు యాగంటి పల్లె సుబ్బరాయుడు, ఎమ్మార్పీఎస్ కొలిమిగుండ్ల మండల అధ్యక్షులు నాగాంజనేయులు, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు మద్దిలేటి, మోహన్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీను మాదిగ, భూపాల్ మాదిగ, యాగంటి పల్లె శివ నాగరాజు మాదిగ, సాధుకొట్టం శేఖర్ మాదిగ, పాతపాడు మదిలేటి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.నాగరాజు

10, 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా

జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10, 11వ తేదీల్లో నంద్యాల కలెక్టరేట్ ముందు జరుగు 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నేతలు కోరారు. కలెక్టరేట్ ప్రాంతంలో చేపట్టే ధర్నా కార్యక్రమం స్థలాన్ని శనివారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ, నాగరాజు, తోట ముద్దులు, సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, ఎం.గురుస్వామిలు పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అనేక సంవత్సరాలుగా గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు, పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ నిత్యం సేవలు అందిస్తున్నారని తెలిపారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని ఈ నెల 10, 11వ తేదీల్లో సోమ, మంగళవారం రెండు రోజులు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే 36 గంటల ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పేదవాడి గుండె చప్పుడు వైఎస్ఆర్

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదవాడి గుండె చప్పుడు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ అని, సంక్షేమంతో చరిత్రలో చెరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాలు వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 74వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారికి పరిచయం అక్కర్లేని పేరు, ఉమ్మడి ఎపి సిఎంగా రెండుసార్లు బాధ్యతలు స్వీకరించి, తన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఇప్పటికీ చెరగని ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తి వైఎస్ఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నీసా, రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, శాంతిరాం విద్యాసంస్థల డైరెక్టర్, మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **మహానంది** మండలం బుక్కాపురం గ్రామంలో వైసిపి మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌బికె వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ నాగభూపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కుంచేపు లక్ష్మీనరసమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, సర్పంచులు కందుల వరలక్ష్మి, సుదర్శన్ పాల్గొన్నారు. **అవుకు** పట్టణంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సోదరులతో కలిసి వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. **ఆళ్లగడ్డ** పట్టణంలోని నాలుగు రహదారుల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిలు నివాళులర్పించారు. నంద్యాల విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, ఎంపిపి (మిగతా 6వ పేజీలో..)

వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రైతన్న సంక్షేమమే వైఎస్ఆర్ కోరిక : జెడ్పి చైర్మన్

ప్రజాశక్తి - పాణ్యం

రైతు సంతోషంగా వున్నప్పుడే రాజ్యం ఆర్థికంగా బలంగా ఉంటుందని, రైతు సంక్షేమమే వైఎస్ఆర్ కోరిక అని జిల్లా పరిషత్ చైర్మన్ ఏర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శనివారం వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన పాణ్యంకి చెందిన యువ ఉద్యాన రైతు పివి గోపి కృష్ణా రావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన అమలు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయ సాగు విధానాన్ని ప్రశంసించారు. ఈ విధమైన సాగు వల్ల ప్రజలకు ఆరోగ్యంతో పాటు రైతులు కూడా ఆర్థికంగా నిలదొక్కు కుంటారని తెలిపారు. ఈ సందర్భంగా రైతు గోపికృష్ణను అభినందించారు.

రైతు గోపికృష్ణతో జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

మరో నల్ల చట్టం తెచ్చేందుకు కేంద్రం కుట్ర

- యూనిఫామ్ సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా ప్రజా సంఘాలు నిరసన

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పాములపాడు
యూనిఫామ్ సివిల్ కోడ్‌తో బిజెపి ప్రభుత్వం మరో నల్ల చట్టాన్ని తెచ్చేందుకు కుట్ర పన్నుతోందని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు యునిసిఎ వ్యతిరేకంగా పాములపాడు ప్రధాన రహదారిపై ప్రజా సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా భారతి యూత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు యస్. షర్ఫుద్దీన్ అలీ, బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూరు ఇంచార్జ్ ఎల్. స్వాములు, బీసీ సంఘం నాయకులు మురళీమోహన్, నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఎం. వెంకట రమేష్, రజక సంఘం మండల అధ్యక్షుడు వి. రామకృష్ణుడు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు బి.గాలి గౌడు, వైసిపి మండల నాయకుడు లింగాల పి.అంజయ్య, తదితర ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. వివిధ జాతులు, మతాలు, కులాలు ఉన్న భారతదేశంలో యూనిఫామ్ సివిల్ కోడ్ సాధ్యం కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, లా కమిషన్ ఆఫ్ ఇండియా ప్రజా అభిప్రాయం కోసం ఈనెల 14 నుంచి జూలై 14 వరకు సూచనలు ఇవ్వాలని కోరిందన్నారు. కానీ దేశ ప్రజలకు ఇప్పటివరకు యూనిఫామ్ సివిల్ కోడ్‌పై అవగాహన లేనందున ఈ అభిప్రాయం తెలపడంలో వెనుక పడ్డారన్నారు. ఇప్పటికైనా ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్లైన్ ద్వారా, వినతి పత్రాల ద్వారా తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జి.సాయి కృష్ణ, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు సయ్యద్ ముర్తుజా వలి, సద్దాం, తదితర సంఘాల నాయకులు వినతి పత్రాలు పంపారు.

రాష్ట్రంలో జనరంజక పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి
ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం చాగలమర్రి పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలోని గుంత పాలెంలో సచివాలయాల పరిధిలో ఎంపిపి వీరభద్రుడు,వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు అమ్మఒడి, ఇంటి పట్టాలు తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్, వైస్ ఎంపిపి రఫి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, వైసిపి నాయకులు గేట్లమాబు,ఎంపిటిసి ఫయాజ్,మండల కోఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలం లోని నందవరం గ్రామం లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నందవరం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకి చౌడేశ్వరి దేవస్థానం మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి, టీటీడీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ పి.ఆర్ మురళీమోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, పి ఎల్ తులసి రెడ్డి ,కె.వి.చెన్నారెడ్డి ,దశరథ రామిరెడ్డి,పి.ఆర్ చిన్ని ఓబుల్ రెడ్డి,పి.గణేష్ యాదవ్,సుబ్బయ్య గౌడ్,శేఖర్ గౌడ్,మిద్దె కంబగిరి,వడ్డే తిరుపాల్,గ్రామ సర్పంచ్ ఖైరున్ బి,నాగరాజు,మాజీ సర్పంచ్ బాలయ్య, నాయకులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ బుక్ లేట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

సంక్షేమ బుక్ లేట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు ఇబ్బందులు : సిపిఎం

ప్రజాశక్తి - పగిడ్యాల
మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లే పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు పి పక్కీర్ సాహెబ్ మండిపడ్డారు. శనివారం మండలంలోని లక్ష్మాపురం గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులను వారు పరిశీలించారు. పాఠశాల గేట్ ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు ఎంతోమంది విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు సుదూర ప్రాంతాల నుంచి హాజరయ్యారన్నారు. పరీక్ష సమయం ఉదయం10 గంటలైనా గేటు తెరవకుండా విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను రోడ్డుపైన నిలిపడం సరికాదన్నారు. 10 గంటలకు పరీక్ష ప్రారంభించాల్సిన ప్రిన్సిపాల్ 10: 30 నిమిషాలకు పరీక్ష ప్రారంభించడంపై వారు మండిపడ్డారు. రోడ్డుపై విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతూండగా పాటు రహదారిపై వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బెస్త రాజు, టి గోపాలకృష్ణ, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం తదితరులు

ప్రజాశక్తి - ఆత్మకూర్
పెండింగ్‌లో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, ఆత్మకూరు పట్టణ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఎం రజాక్, రామ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చెత్తాచెదారాన్ని, మురుగు కాల్వలు శుభ్రం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఒకపక్క రోజురోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ ఉంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలు నెలనెలా సక్రమంగా రాక కుటుంబాలను పోషించుకోలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సర్పంచి, జిల్లా అధికారుల చుట్టూ తిరిగిన ఏమాత్రం ఫలితం లేదు అన్నారు. మూడు సంవత్సరాల క్రితం రూ.10000 జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 వచ్చినా నేటికీ అమలు కావడం లేదని అన్నారు. పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ప్రభుత్వంపై ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

మినీ మేని ఫ్యాస్టో కర పత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు

పేదవాడి అభివృద్ధే లక్ష్యం : టిడిపి

ప్రజాశక్తి -ప్యాపిలి
పేదవాడి కడుపు నింపడమే టీడీపీ లక్ష్యమని సీనియర్ టీడీపీ నాయకుడు పెద్ద నాగిరెడ్డి అన్నారు. శనివారం నాడు పట్టణంలో ఇంటిటికి తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టో పత్రాలను పంచుతూ ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్టంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అవినీతి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో రాఘవేంద్ర,లక్ష్మి నారాయణ యాదవ్, రామసుబ్బయ్య,రాంమోహన్,చిన్న సుంకయ్య, సుదర్శన్, ధనం మధు, చల్లా వీర,కొంగనపల్లెమధు,మౌలాలి రెడ్డి,మల్లి,గోపాల్ రెడ్డి,శీను,రామాంజి పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్

ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల
నంద్యాల పట్టణంలో విచ్చలవిడిగా ఆటో ఫైనాన్స్ పేరుతో ఆటో డ్రైవర్లను, బైకు వాహనదారులను భారీగా వడ్డీలతో దోచుకుతింటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ అధికారులను కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణంలో పుట్టగొడుగుల్లా ఆటో ఫైనాన్స్, బైక్ ఫైనాన్స్ పేరుతో వెలిశాయన్నారు. వాటికి ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. బొమ్మ సత్రం సెంటర్లో సాయి రూప ఆటో ఫైనాన్స్ ఆటో డ్రైవర్‌కు కనీస అవగాహన లేకపోవడంతో వేలకు వేలు వసూలు చేశారని, డ్రైవర్ ఆటో అమ్ముకుని చిన్నపాటి వ్యాపారం పెట్టుకోవాలని ఎలాంటి కంతులు లేవని సర్టిఫికెట్ ఇవ్వాలని కోరగా ఇంకొక కంతు 6 వేల రూపాయలు ఉందని, దానికి వడ్డీ నాలుగు సంవత్సరాలకు గాను 46 వేలు కడితే ఇస్తామని, లేకపోతే ఇవ్వబోమని యూనియన్ నాయకుల ముందే రెచ్చిపోయారన్నారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆటో ఫైనాన్స్ ఆఫీసుల ముందు ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, యూనియన్ నాయకులు ఖాజా, రామచంద్రుడుతోపాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 51 మంది హాజరు

ప్రజాశక్తి - పగిడ్యాల
మండలంలోని లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎనిమిదవ తరగతి ప్రవేశ పరీక్షకు 51 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతిలో ఖాళీగా ఉన్న 4 సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. 52 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 51 మంది విద్యార్థులు పరీక్ష హాజరయ్యారని ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతో రైతులకు ప్రయోజనం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోవెలకుంట్ల
రైతుల పక్షపాతిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు వైయస్సార్ రైతు దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్సార్ అగ్రిటెక్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్ర బోతుల పాపి రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రిటెక్ ల్యాబ్ వల్ల భూసార పరీక్షలు, విత్తనాలు ఎరువులు పురుగుల మందుల నాణ్యతను ఇక్కడ పరిశీలించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజా రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బివి నాగార్జున రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, కోయిలకుంట్ల పట్టణ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ ఉపసర్పంచ్ జి సి ఆర్ సూర్యనారాయణ రెడ్డి, కోయిలకుంట్ల మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ భీమిరెడ్డి నాగ ప్రతాపరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, కోయిలకుంట్ల మండల గ్రామ సచివాలయ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, పోచ వెంకటరామిరెడ్డి, మండల సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం : మండల కేంద్రములో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను, నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ కేంద్రంను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గాన్ని జిల్లా స్థాయిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ పల్లవి, ఎం పి పి హుస్సేన్ బీ,మండల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతో రైతులకు ప్రయోజనం అని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో డాక్టర్ వైయస్ఆర్ రైతు దినోత్సవం పురస్కరించుకొని డా.వైయస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు విభాగం చైర్మన్ వంగల సిద్ధారెడ్డి, అగ్రికల్చర్ ఏడి వర ప్రసాద్, ఎఈ విజయ శేఖర్, ఎమ్మార్వో రాజశేఖర్ బాబు, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ లు హామీద్ మియ్య, అబ్దుల్ రవూఫ్, మనపాడు అశోక్, లాలు ప్రసాద్, ఉపేంద్ర రెడ్డి, బొల్లెద్దుల రామక్రిష్ణ, కిరణ్ కుమార్ రెడ్డి, జె.సి.యస్ మండల ఇంచార్జ్ ఓంకార్ రెడ్డి, వైస్ ఎంపీపీ పబ్బతి రవి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, వైసిపి నాయకులు శాలి భాష, కురువ శ్రీను, సులోచనమ్మ, వ్యవసాయ శాఖ అధికారులు తదీతరులు పాల్గొన్నారు.

అగ్రిటెక్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అగ్రిటెక్ ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి

కడమల కాల్వలో పెరుగుతున్న అతిసార

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్
మండలంలోని కడమల కాల్వ గ్రామంలో శనివారం ఐదు మందికి అతిసార వ్యాధి సోకినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. గ్రామంలో తాగునీటి వసతులను ఆపివేసి రక్షిత మంచినీరు ప్రజలకు అందిస్తున్నారని, అయినా అతిసార వ్యాధి సోకుతుండడం పట్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వైద్యారోగ్య శాఖ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు సమిష్టిగా కృషి చేస్తున్నా అతి సారా వ్యాధి నియంత్రణ కాకపోవడం పట్ల గ్రామ ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల నుండి గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ ప్రతిరోజు గ్రామం లో పర్యటిస్తున్నారు. అయినా అతిసార వ్యాధికి మూలాలను కనిపెట్టడంలో విఫలమయ్యారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. వైద్య శిబిరాలు పెట్టి స్థానికులకు వైద్య సేవలు అందిస్తున్నా తగ్గక ప్రైవేట్ ఆస్పత్రులకు, కార్పొరేట్ ఆసుపత్రులకు బాధితులు వెళుతున్నారు. అతిసార వ్యాధికి మూలాలను కనిపెట్టి నియంత్రించాలని, మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్డబ్ల్యూఎస్ డి.శ్రీనివాసులు, ఏఈ లక్ష్మీనరసింహ, ఈవోఆర్‌డి శ్రీనివాసులు, డాక్టర్ల బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార రోగులను పరీక్షిస్తున్న డిఎం హెచ్ఓ

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - ఆత్మకూరు
ఆత్మకూర్ ప్రభుత్వ వైద్యశాలలో వివిధ హోదాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళుతున్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ నారాయణ, ఫార్మసిస్ట్ సి ప్రవీణ్, ల్యాబ్ టెక్నీషియన్ రోజమ్మ, జూనియర్ అసిస్టెంట్ మహేష్ బాబులను ఆప్త మాలిక్ షేక్షావలిని శనివారం నాడు వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ సామాజిక ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి విధుల్లో చేరిన తర్వాత బదిలీలు తప్పవని అన్నారు. కార్యక్రమం లో వైద్యులు నాగరాజు జుబేదాబేగం, అనుపమ, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న వైద్యులు

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ మార్కుల మెమోలు సిద్ధం

ప్రజాశక్తి - బేతంచర్ల
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఓపెన్ స్కూల్ 10, ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులకు మార్కుల జాబితాలు సిద్ధంగా ఉన్నాయని భాగ్యోదయ హై స్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి శనివారం నాడు తెలిపారు. 2023వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఓపెన్ స్కూల్, ఇంటర్ పరీక్షలు రాసి పాసైన అభ్యర్థులు మార్క్స్ మెమోలు, మైగ్రేషన్ టిసిలు భాగ్యోదయ స్కూల్ నందు సిద్ధపరిచి ఉన్నాయని, అభ్యర్థులు తీసుకోవాలని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు 9394239596 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పేదవాడి గుండె చప్పుడు వైఎస్ఆర్

వైయస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న చైర్మన్ డాక్టర్ ఆసియా

వైయస్సార్ స్మృతి వనంలో కేకులు కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

(5వ పేజీ తరువాయి..) గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కూలూరు నరసింహ రెడ్డి, దాల్ మిల్ గఫూర్, బద్రి సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ నజీర్, బద్రి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** మండలంలోని పలుకూరు గ్రామంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు గుండం భాస్కర్ రెడ్డి, ఎస్‌విఆర్ విద్యాసంస్థల అధినేత శనివారపు వెంకటరామిరెడ్డి, సచివాలయం కన్వీనర్ వెంకటసుబ్బారెడ్డి, మండ్ల భూపాల్ రెడ్డి, కాటసాని పుల్లారెడ్డి, సచివాలయ కన్వీనర్ వడ్డే వెంకటేష్, తెలుగు వెంకట గురువయ్య, జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. **సంజామల** మండలంలోని అన్ని గ్రామాల్లో వైసిపి నాయకులు వైయస్సార్ 74వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి నివాళ్లులర్పించారు. **బనగానపల్లె** పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు వారు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దీవెనమ్మ, జడ్పిటిసి సుబ్బ లక్ష్మమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, నాయకులు అబ్దుల్ ఫైజ్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ ,ఈసారి ఎల్లయ్య, కిషోర్, జిల్లెల్ల శంకర్ రెడ్డి, వార్డ్ మెంబర్ సురేష్, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, సైకిల్ షాప్ మహబూబ్ వలి, విఠలాపురం వీరారెడ్డి, సజ్జాథ్ హుస్సేన్ పాల్గొన్నారు. **ఆత్మకూరు :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను శనివారం నాడు ఆత్మకూరు మండలంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని పార్టీ కార్యాలయం నుండి భారీ మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించి పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, తదితరులు పూలమాలలు వేసి పాలాభిషేకాన్ని నిర్వహించారు. **ఆత్మకూరు పట్టణంలో..** వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రం చైర్మన్ మహబూబ్ బాషా వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకల సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళు లర్పించారు. మండలంలోని కరివేన గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో కొండలరావు గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ గ్రామ కార్యదర్శి రాజశేఖర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. **వైయస్సార్ స్మృతి వనంలో.** నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్, వైసిపి ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, పువ్వాడి భాస్కర్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాల్గొని కేకులు కట్ చేశారు. **పాములపాడు:** మండలంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆర్థర్ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు చౌడయ్య, మధుసూదన్ రావు, బాలేశ్వర్ రెడ్డి, అంబయ్య, రాజన్న, బాలు నాయక్, నాయకులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** మండలంలో మాజీ సిఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను బేతంచెర్ల పట్టణం, ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం, సిమెంటు నగర్, ఆర్ కొత్తపల్లి గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. బేతంచెర్ల విశ్వాస్ లాడ్జి దగ్గర వైఎస్ఆర్ అభిమానులు వైఎస్ఆర్ విగ్రహా నికి పూలమాలలు వేసి కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్‌లో బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు వైస్ ఎంపీపీ రంగస్వామి, మూర్తి జావలి. కాజా. గూని నాగరాజు, బీరేలి నాగేశ్వర్ రెడ్డి, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, సొసైటీ డైరెక్టర్ రుద్రవరం నారాయణ, సర్పంచులు కోడే వెంకటేశ్వర్లు, రాజు, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ఆంధ్ర రాష్ట్ర ప్రజల గుండెచప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ అని రాష్ట్ర వైసీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరభద్రుడు పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలోని పెద్దమకానం వీధిలో గల వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముత్యాలపాడు గ్రామంలో సాగునీటి తాగునీటి సాగునీటి సంఘం అధ్యక్షుడు శేష రమేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అబ్దుల్లా భాష, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ మండల కో ఆప్షన్ సభ్యుడు జిగ్గి గారి ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజ్, లక్ష్మీ రెడ్డి ,జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జాబీర్, సింగిల్ విండో అధ్యక్షులు దస్తగిరి , తోడేండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని రైతులకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆరాధ్య దైవంగా నిలిచారని జడ్పిటిసి సభ్యురాలు లక్ష్మీదేవి, వైసీపీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు అన్నారు. చాగలమర్రి మండలంలోని శెట్టివీడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గ్రామ ఇంచార్జ్ పెనుగొండ రాధిక, విహెచ్ఏ ఉమామహేశ్వరి , మండల వైసీపీ నాయకులు వెంకటరమణ, డక్కన్ రమణారెడ్డి, కడ్డీల రమణారెడ్డి, పగిడాల బాబు, వార్డు సభ్యురాలు గోన సంజమ్మ, గ్రామ నాయకులు చిన్న ఓబులేష్, బికారి, టిఎన్ మహబూబ్ బాషా, జమాల్, రామ్మోహన్, పుల్లయ్య, నరసింహ, నరసయ్య, టీవీఎస్ భాష, సంజీవ రాయుడు, శివయ్య, బాలయ్య, పాపన్న, నడపన్న తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** స్థానిక వైసిపి కార్యలయంలో జడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేస్వర రెడ్డి, ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ పుల్లారెడ్డి వైఎస్ఆర్ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి సొసైటీ చైర్మన్ బోరెడ్డి రాము, రాజా మురళి,మల్లికార్జునరెడ్డి, మస్తాన్ ఖాన్,వి శీను, కొండయ్య,ప్రభాకర్ రెడ్డి, నిజాముద్దీన్ ,సోమశేఖర్,పర్వతం, బషీర్, షాషా, పాండు మధు,పెద్ది రాజు, శీనువాసులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** పట్టణంలోని బిఆర్ఆర్ నగర్ (అల్లూరు రోడ్డు) లో ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే ఆర్థర్ అలంకరణ చేసి, పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ శుకూర్ , రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, బ్రాహ్మణ కొట్కూరు సింగిల్ విండో చైర్మన్ హరి సర్వోత్తమ్ రెడ్డి నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ సగినెల. హుస్సేనయ్య జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు యస్. వెంకట రమణ, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు శ్రీ సంటి దిలీప్ రాజ్, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **నందికొట్కూరు మున్సిపాలిటీ కార్యాలయం నందు..** మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం నందు వైఎస్ఆర్ చిత్ర పటానికి చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి నందికొట్కూరు ఎంపిపి మురళీకృష్ణ రెడ్డి, యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్షపోగు ప్రశాంతి, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, జె.సి.యస్ నందికొ ట్కూరు టౌన్ ఇంచార్జ్ అబుబక్కర్, జె.సి.యస్ నందికొట్కూరు మండల ఇంచార్జ్ ఓంకార్ రెడ్డి, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు నివాళులర్పించారు. **పగిడ్యాల :** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట గ్రామాలలో వైసిపి నాయకులు వైయస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పగిడ్యాలలో జడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న ఆధ్వర్యంలో వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మాపురం గ్రామంలో వైసీపీ నాయకుడు భూషి గౌడు ఆధ్వర్యంలో, రైతు దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నందికొట్కూరు : వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

ప్యాపిలి : వైఎస్ఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

పగిడ్యాల : వైయస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాములపాడు: వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు